# ఉదయ సముద్రం

-ఎలికట్టె శంకర్‌రావు

పడమటి కొంగిన సూర్యుడు కమ్మరి కొలిమిలో నుండి తీసిన రోకలి పొన్నోలి గుండు. ఉస్మానియా పిజీ కాలేజీ సంటరు నుండి పిల్లలు గుంపులు గుంపులుగా బయటి కొస్తుండ్రు. కాలేజీ బిల్డింగుకు ధీటుగా ఎదిగిన ఆశోక చెట్ల నుంచి అప్పుడోటి అప్పుడోటి ఎండుటాకు రాలి పడుతుంది. గేటు దాంక గుంపుగా వొచ్చిన పిల్లలు దాటింతర్వాత యిరుకు తోవలో గొర్లోలిగ ఒకరెనుకంగ వొకలు నడుస్తుండ్రు. ప్రధానమైన బారు ఎడమ వైపుకు మల్లి మెయిన్ రోడ్డు మీదికి పోతుంటే ఒకటి రొండు జంటలు కుడి వైపు తిరిగినయ్.

కాలేజీ కాంపౌండుకు ఆనుకుందా అన్నట్లు వుంది ఉదయ సముద్రం. కుడివైపు మల్లిన జంటలు ఒకరి మాటలు వొకరికి యినబడనంత దూరంలో నడుసు కుంట గుసగుసలాడుతున్నయ్.

ఉదయ సముద్రం కాలేజీ ఆడపిల్లల గుండె లోలిగ నిండుగా- నిశ్శబ్దంగా వుంది. ఉదయ సముద్రాన్ని- అదే పానగల్లు చెరువు- పిజీ సంటరును ఒకేసారి చూస్తే టాంక్‌బండ్ పక్కన ఆర్ట్స్ కాలేజీ పెట్టినట్లుగా కనిపిస్తుంది.

విశాలంగా పర్సుకున్న ఉదయ సముద్రాన్ని చూస్తూ ఒకరి చేతిలో ఒకరు చేయి వేసి నడుస్తుండ్రు గాయత్రీ, రఘులు.

చిన్న చిన్న అలలను, ఎగురుతున్న పిట్టలను మైమ రచి పోయి చూస్తూ కట్ట మీద నడుస్తుండ్రు.

"ఏంది రఘూ! ఎన్నడు నీల్లను చూడనట్లుగా అంత యిదిగా చూస్తున్నావ్!" గాయత్రి చున్నీ సరిచేసుకుంట అడిగింది.

రఘు తదేకంగా సముద్రాన్ని చూసుకుంటూ నేను ఎదిగే నాటికి మా వూల్లె చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయినయ్. నల్లగొండ జిల్లాలో జలాశయమంటె యిదేగా? చూసుకుంట పరవశించిపోతున్నా? గంభీ రంగా అన్నాడు.

'అదేంటి నాగార్జునసాగర్ వుందిగా?'

'ఉంది. డ్యాం మాత్రమే వుంది. కానీ నీల్లు మనియ్ కావు. ఈ నీల్లు ప్రతి చుక్కా యిక్కడి పొలాలకు పారు తుందని ఊహించుకుంటె సంబూరమైతుంది?' చెరు వులో తెప్పల మీద తిరుగుతున్న బెస్తోల్లను చూసుకుంట అన్నడు.

రఘుది వ్యవసాయ కుటుంబమని తెల్సు గాయ త్రికి. ఇక్కడి నేల నీల్లు లేక ఎట్ల ఎండిపోయేదీ, ఇక్కడి రైతులు నీల్ల కోసం ఎంత మొకం వాసిందీ అతని మాటల్లో చాలాసార్లు విన్నది.

'అక్కడ కూసుందామా?' కట్ట లోపల వైపు రాతి కట్టడాన్ని సూపించింది గాయత్రి.

ఇద్దరు సదునైన రాల్లను సూసుకొని కూసుండ్రు.

'రఘూ! ఇంకో రొన్నెల్లలో పీజీ అయిపోతుంది?' తర్వాత ఆలోచన ఏంది అన్నట్లుగా అడిగింది.

'అదే వెంటాడే ప్రశ్న. భవిష్యత్తు గందరగోలంగా కనిపిస్తుంది. బీయిడి చేసి నాలుగేండ్లు అయితుంది. సర్కారు మారినా డియస్సీ ఊసే యెత్తటంలేదు. జూన్ టూ మార్చి ఉద్యోగాల గురించి ఆలోచించే సర్కారుకు నిరుద్యోగ సమస్య గురించి ఆలోచించటానికి తీరిక లేదేమో?' రఘు పొడుగ్గా గాలొదిలిండు ముక్కుల గుండ.

'మీ నాన్న వాలెంటరీ రిటైర్‌మెంటు తీసుకుండని చెప్పినట్లు గుర్తు?'

'అవును. ఆరేండ్ల సర్వీసుండగనే ప్యానల్ హెడ్ మాస్టర్‌గా వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుండు. ఆ ఉద్యోగం నా కొస్తదని. తొమ్మిదేండ్లయింది. మా నాయిన ఆశలు అగో వొడ్డుకు తాకే ఆ నీటి అలలోలి గనే చెదిరిపోతున్నయ్. పన్నెండేండ్ల కింద విఆరెస్ తీసుకున్న వాళ్ళ పిల్లలే ఆఫీసుల సుట్టు చెప్పులరగదీసు కుంటుండ్రు. ఈ జన్మలో మా నాయిన ఉద్యోగం నేను చేస్త అన్న నమ్మకం లేదు?' నీటిలోకి రాల్లను విసు రుతూ నిట్టూర్సిండు రఘు.

'రఘూ మరీ అంత సీరియస్‌గా ఆలోచించకు. ఇదికాకపోతే ఇంకోటి. డీలా పడిపోతే ఎట్ల?' వాతావర ణం తేలికపర్సటానికన్నట్లుగా భుజంమీద సర్సింది.

రఘు తేరుకొని గాయత్రీ మొహంలోకి చూసిండు. గాయత్రి నవ్వుతూ రఘు ఎద మీద తల వాల్సింది. అట్లనే పొదిమి పట్టుకొని నుదిటి మీద ముద్దాడిండు రఘు.

'ఆ సూర్యు అట్ల నిలిచిపోతే ఎంత బావుండు' రఘు చాతీ మీద వేల్లతో రాస్తూ గోముగా అన్నది.

వాతావరణం చల్లబడ్డది. సముద్రం మీది నుంచి చల్లని గాలి వొంటికి తగిలి హాయిగొలుపుతుంది.

సముద్రం మీద అంతసేపూ తిరిగిన చిన్న చిన్న తెప్పలు వొద్దుకు వొస్తున్నయ్. కట్ట మీద అక్కడక్కడ బెస్త స్త్రీలు గంపలు పెట్టుకొని తెప్పల కోసం ఎదురు చూస్తుంద్రు.

కట్ట మీద అలికిడి పెరిగింది. అప్పటిదాంక ఎక్కడో దూరంగ రాళ్లమీద, మరుగున వున్న జంటలు లేస్తున్నయ్. విశాలమైన కట్టమీద దూరం నుంచి నడి చొస్తున్న మనుషులు నిలువుగా నడిచే నల్లచీమలోలిగ కనిపిస్తుంద్రు.

'రఘు లేద్దామా?'

గాయత్రి చేయి పట్టుకొని లేసిండు రఘు. ఒకరి మీది ఒకరు మళ్ళీ పడుకుంట ఊసులాడుకుంట రోడ్డె క్కింద్రు.

కాలేజీ పిల్లల కోసం ఎదురు చూసే ఆటోలు యెల్లిపోయినయ్. గుడెసె హోటలు బందయ్యింది. రోడ్డు మీద జంగిడి బర్లు ఒకదాని కోటి రాసుకుంట నేషనల్ హైవే మీద లోడు లారీలోలిగ ఊర్లెకు పోతు న్నయ్.

దుమ్ము మేఘాలోలిగ లేస్తుంటే ముక్కులకు దస్తీలు అడ్డం పెట్టుకొని నిలబడ్డరు. అంత దూరంలో చాయా సోమేశ్వరాలయం నల్లబోడోలిగ కనిపిస్తుంది.

పొలాలు దున్నటానికి వొచ్చిపోయే టాక్టర్ల వల్ల మట్టి రోడ్డు చిత్తడి చిత్తడిగా వుంది. చుట్టూ పొలాల నుంచి జాలువారిన నీళ్లు. బాట పక్కన నీటి గుంటలు. జమ్మి ఏపుగా పెరిగి పర్చుకుంది.

అడుగులో అడుగేసుకుంట నడుస్తుంద్రు.

'పానగల్లు ఊల్లె దాంక నడవాల్సిందే. అక్కడుం టయ్ ఆటోలు' అన్నాడు రఘు.

గాయత్రి నవ్వుతూ రఘును చూసి 'మాట్లాడకుంట నడుద్దాం' అన్నది.

రోడ్డుకు ఎడమ పక్కన విశాలంగా పర్చుకోనున్న తెల్లబండ. దాని మీద వంట చేస్తున్న బాతులోల్ల కుటుం బాలు. చిన్న చింపిరి జుట్టు పిల్ల వలతో కట్టిన దొడ్డి లోకి బాతులను తోల్తుంది. కుంటు కుంట నడుస్తున్న బాతును మెడ పట్టుకొని లేపి కాలు దిక్కు చూస్తుంది. బాతు కాలులో ముల్లు యిరిగినట్లుంది. తీయటానికి ప్రయత్నం చేస్తుంది. బండ మీద ఒకవైపు బుట్టల్ల వొరిపొట్టు పోసి పేర్చిన గుడ్లు- ముగ్గుబుట్టలోలి గున్నయ్.

పానగల్లు ఊరి బైటనే ఆటోల స్టాండు. ఆటో వానికి అడ్రసు చెప్పి ఎక్కింద్రు. అప్పటికే కపర కపర చీకటి కమ్ముకుంటుంది.

❖ ❖ ❖

గాయత్రి తల్లి ఎదురు చూసుకుంట గేటు కాడ కాలు గాలిన పిల్లోలిగ తచ్చాడుతుంది. ఊసురుమంటు వొచ్చిన కుతుర్ను చూసి 'ఇంత లేటయ్యింది?' అడిగింది తల్లి ఆందోళనగా.

'కాలేజి నుంచి ఫ్రెండ్ వాళ్ళింటికి పోయిన్నమా' సంజాయిషీగా చెప్పి ఆగకుంట తల నేలకేసుకొని లోపలికి పోయింది గాయత్రి.

గాయత్రి తల్లి బ్లాండినమ్మ మాత్రం కూతురు సమాధానానికి సంతృప్తిపడలేదు. భర్త రామశర్మ కుర్చీలో కూసుని అదే పనిగా టీవీ వార్తలు చూస్తుండ టం ఆమెకు చికాకు తెప్పించింది.

భర్త చేతిలో రిమోట్ గుంజుకొని 'ఏంది మీరు ఆడపిల్ల- ఎటు తిరుగుతుందో ఎప్పుడొస్తుందో కూడ పట్టించుకోరు' అసహనంగా అన్నది.

రామశర్మ భార్య దిక్కు చూసి నవ్విండు.

ఆయన నవ్వులో తమ ప్రేమ, తిరుగుల్లు కనిపించి నయ్ బ్లాండినమ్మకు. మౌనంగా రిమోట్ భర్త చేతిలో పెట్టి విసవిసా యెల్లిపోయింది.

కాల్లు చేతులు కడుక్కొని వొస్తున్న కూతుర్ను 'స్టెల్లా యిదేం బాలేదు. ఒకటికి పదిసార్లు చెప్పటానికి నువ్వు మరీ చిన్నపిల్లవు కాదు' కోపంగా అన్నది.

స్టెల్లా గాయత్రి పకపకా నవ్వుకుంట తల్లి మెడ చుట్టూ చేతులేసి అల్లుకుంది. 'అమ్మా ఎందుకు అంత కంగారు పడతావ్? నేను మరీ అమాయకురాలిని కాదులే' అన్నది.

'ఏమోనమ్మా' అనుకుంట టీవీ హాల్లోకొచ్చింది తల్లి. తల్లిని అనుసరిస్తూ గాయత్రి వొచ్చింది.

తల్లీ కూతుల్లను చూసిన రామశర్మ టీవీ వాల్యూం తగ్గించి 'గాయత్రీ' అని పిలిసిండు.

గాయత్రి తండ్రి దగ్గరకు పోయి నిలబడ్డది. కూతురు తలమీద చెయ్యేసి నిమురుతూ మొకంలోకి చూసిండు. గాయత్రి కండ్లల్లో ఏదో బెరుకు కనిపిం చింది. తను విన్నది నిజమే అనుకుండు.

'గాయత్రీ జీవితం వేరు ప్రేమ వేరమ్మా' అన్నాడు ప్రస్తావనగా.

గాయత్రి కంగారును దాయటానికి ప్రయత్నం చేసుకుంట 'ఏంది నాన్నా?' అమాయకంగా అడగ బోయింది.

'స్నేహాలు, ప్రేమలు కాదననమ్మా. నాకు వాటి

మీద విశ్వాసముంది.' గతం గుర్తుకొచ్చి ఆగిండు.

గాయత్రి తల్లి దిక్కు, తండ్రి దిక్కు మార్చి మార్చి చూసింది.

'ఆర్థిక స్వాతంత్ర్యం లేని ప్రేమలు నిలవటం కష్ట మమ్మా. నేనెందుకు చెపుతున్నానో అర్థం చేసుకో. జీవితంలో ప్రేమ కంటే కెరీర్- డబ్బు ముఖ్యం' అనుభవ సారాన్ని రంగరించినట్లుగా చెప్పిండు.

'స్టెల్లా! నిన్ను తప్పుపట్టటం కాదు కాని ఆ రఘు గురించి ఆలోచించినవా? ఉద్యోగం సద్యోగం లేదు. వొస్తదో రాదో తెల్వదు' తల్లి మాటలకు తెల్ల మొక మేసింది గాయత్రి.

అయితే తన తల్లిదండ్రులకు అంతా తెలుసన్న మాట. ఇంక దాయటమెందుకు? అనుకొని 'రఘు నాతో పాటు పీజీ చేస్తుండమ్మా. బీయిడీ కూడా ఉంది' అన్నది.

"ఇయ్యాల రేపు అందరు సదువుతారు. ఉద్యోగాలు కొందరికే వొస్తయ్. అందులో వెంకట నర్సింహరావు కొడుకని తెలిసింది. ప్రభుత్వం ఉద్యోగాలిస్తుందా అనేది వొక ఎత్తయితే- వోపన్ కేటగిరీలో ఉద్యోగం సంపాయించగలడా అనేది మరో ఎత్తు.' రామశర్మ గొంతులో కూతురు భవిష్యత్తు గురించిన ఆందోళన.

'స్టెల్లా మా మాట విను. లేదూ నీ యిస్టమనుకుంటే మల్లా నా మూలాల్లో కలిసిపోతావ్' తల్లి గొంతు కరుగ్గా వినిపించింది.

గాయత్రి నోట మాట రాక నిలబడిపోతే 'నా సైడు దూరపు బంధువుల్లో ఒక సాఫ్ట్‌వేర్ యింజినీరుండు. నన్ను, నా ఉద్యోగాన్ని చూసి- మా వివాహాని పక్కన పెడుతుండ్రు. నా మాటిని ఆ పిలగాన్ని చేసుకో. రేపో మాపో స్టేట్స్‌కు పోయే చాన్సుంది. అన్నడు తండ్రి రామశర్మ.

'నీ మంచి కోసమే చెపుతున్నం తల్లీ.'

తల్లి మాటతో అక్కన్నుంచి కదిలింది గాయత్రి.

ఉదయ సముద్రం మీది అలలు ఒక్కసారిగా గాయత్రి మనసులో కదిలినయ్.

రామశర్మ మాట్లాడాల్సింది అయిపోయినట్లుగా టీవీ వాల్యూం పెంచిండు.

❖ ❖ ❖

సాయంత్రం కిరణాలు పడి పోత పోసిన యిత్తడి విగ్రహ మోలిగ కనిపిస్తుండు రఘు.

ఉదయ సముద్రం కట్ట మీద కూసోని మైమర్చి పోయి యిద్దరూ అలల దిక్కు చూస్తుండ్రు. ఇద్దరి మనసులో ఎగిరి పడుతున్న అలలు. రఘు చూపు మలిపి గాయత్రిని చూడటం మొదలుపెట్టిండు. చేయి తిరిగిన శిల్పి చెక్కిన నల్లరాతి విగ్రహంగా కనిపించింది గాయత్రి.

ఆ చూపుల నుంచి తప్పుకోవటానికన్నట్లుగా గువ్వ పిల్లోలిగ రఘు వొడిలో వొదిగి పోయింది.

'రఘూ యింకో నాలుగు రోజుల్లో ఫైనల్ ఎగ్జామ్స్' గుసగుసగా అన్నది.

'అవును' అంతకంటె చిన్నగా గాయత్రి చెవిలో గునిగిండు రఘు.

'మనం యింతతీరికగా కల్సుకోవటానికి వీలుండదేమో?'

'రఘూ! ఏంది ఎటో ఆలోచిస్తున్నావ్?' గాయత్రి భుజం మీద చెయ్యేసి అడిగింది.

'ఏం లేదు, కెరీరు ముఖ్యమంటె మా నాయిన అన్న మాటలు యాదికొచ్చినయ్.'

'ఆలోచించిన. నాకు మా అమ్మ వాల్లు చెప్పిందే నిజమనిపించింది. మా నాన్న వాల్లు చూసిన సాఫ్ట్‌వేర్ యింజనీరును చేసుకుందామనుకుంటున్నా.'

గాయత్రి, రఘు రియాక్షన్ కోసం చూసింది.

రఘు రిలాక్స్‌గా కూసుండు.

'బాధపడుతున్నావా?' అడిగింది.

'లేదు కెరీర్ గురించి ఆలోచిస్తున్నా.'

గాయత్రి లేసి రఘు చేతిని పట్టుకొని లేపింది.

'సమ్మర్‌లో పెండ్లి' గాయత్రి పెదవులు వొనికినయ్.

'సమ్మర్‌లో నేను హైదరాబాదు పోతున్నా. మా మామ కాలేజీలో జాయినయితున్నా.'

ఇద్దరు ఒక నిర్ణయానికొచ్చిన వాల్లోలిగ నడుస్తుండ్రు. సముద్రంలోని తెప్పలు వొడ్డుకు చేరుకుంటున్నాయ్. కట్ట మీద మనుషుల అలికిడి. అంత దూరంలో గుమికూడిన జెనం. కట్ట కింద పోలీసు వాహనం కనిపించింది.

గుంపు కాడికి పోయిండ్రు. అప్పుడే వో తెప్ప వొడ్డుకు చేరుతుంది. అంతా అటు దిక్కే చూస్తుండ్రు. పోలీసులు జెనాన్ని పక్కకు జరుపుతుండ్రు.

ఆగిన తెప్పల నుంచి రెండు శవాలను బెస్తోల్లు దించిండ్రు. యువతీ యువకులు. ప్రేమికులేమో!

థ్యాంక్ గాడ్ మన శవాలు కావు అనుకుండ్రు యిద్దరు.

పడమట పొద్దు కుంగుతుంది - తూర్పున పున్నమి చంద్రుడు ఉదయిస్తుండు.

ఆకాశం ప్రశాంతంగానే ఉంది. ■